

"జ్యోతి! సావిత్రికెందుకు చదువు నేర్పుతున్నావు?"

"ఎందుకు నేర్పకూడదు?"

అసలు మన కులంవాళ్ళమే చదువుకోకూడదు. అయినా నిన్ను చదివించాను. ఇప్పుడు నువ్వు నీ భార్యకు చదువు చెబుతున్నావు"–

"ఆమె కూడా మనిషేగా? కాదంటే చెప్పు"

"నిజమే కావచ్చు కానీ ఆడదానికి చదువు పనికిరాదు. చదువుకున్న ఆడది చెడిపోతుంది. బుద్ధి లేనిదవుతుంది"–

"నాన్నా! సావిత్రి చదువుకుని ఆ మాటలన్నీ అబద్ధాలని నిరూపిస్తుంది"

# 2 నేనూ.... సావిత్రీబాయిని

**మూలం : సుషమా దేశ్‌పాండే, అనువాదం: ఓల్గా**

©SCERT not to be republished

నమస్కారం!

ఇవాళ మీ అందరితో మాట్లాడటానికి వచ్చాను. నేను కళ్ళు తెరచి నా చుట్టూ యేం జరుగుతోందని చూస్తే గుండె పగిలిపోతోంది. మా కాలం వెళ్ళిపోయింది. కానీ మీరందరూ మా కాలంలో మేం ఎక్కడున్నామో అక్కడే నిలబడిపోయారా అని ఆశ్చర్యం కలుగుతుంది నాకు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందా అనుకుంటారు. నాకీరోజు మీతో ఎంతో చెప్పాలని ఉంది. ఎన్నో విషయాలు, మేం ఎట్లా బతికాం, ఏం చేశాం. అన్నీ! అడగండి. మేమేదో గొప్ప ఘనకార్యాలు చేశామని చెప్పబోవడంలేదు. నా గురించి చెప్పాలంటే నేను సేఠ్‌జీ పెళ్ళాన్నికాగానే ఆయన చేసే పనిలో చిక్కుకునిపోయాను. ఆ పనేమిటో, దాని సంగతేమిటో తెలియకుండానే అందులో చిక్కుకున్నాను. అదెలా జరిగిందో తెలియకముందే అదంతా నా పని అనుకోడం బొత్తిగా బాగోలేదు.

మొదట్నించి చెప్తా వినండి. నేను పుట్టిందేమో నైగావ్. అయ్యా అదెక్కడుందో మీకు తెలియదు గదూ! మహారాష్ట్రలో సతారాజిల్లాలో ఖండాలా తాలూకాలో ఉంది. అబ్బో ఎంత కుగ్రామమని,అక్కడసలు మనుషులంటారా అని అనుమానం కలిగేంత చిన్నఊరు. ఆ రోజుల్లో ఆ ఊళ్ళో అందరూ అందర్నీ ఎరిగి ఉండేవాళ్ళు. నేనా? పాటిల్ గారింట్లో పెద్దకూతుర్ని, మొదటి సంతానాన్ని, అబ్బా– మీకదంతా చూపించేదా? ఆ చేలలో పడి పరుగెత్తుతూ, ఆ గులకరాళ్ళను, దుమ్మునూ తన్నుకుంటూ–ముళ్ళు గుచ్చుకోవా అంటున్నారా? ముళ్ళూ గిళ్ళూ ఏవీ లెక్కలేదు నాకు. విరబోసుకున్న జుట్టు ముఖంమీద పడుతుంటే వెనక్కి తోసుకుంటూ ఊరంతా వెర్రిగా పరిగెత్తేదాన్ని.

చింతకాయలు కొట్టుకు తినటం, రేగుపళ్లు కోసుకుతినటంలో నన్ను మించినవాళ్లు లేరు. ఒకరోజు యేమైందో తెలుసా? ఔను మీరనుకుంటున్నట్టే జరిగింది. నేనెక్కిన సీమ చింతచెట్టు కొమ్మ విరిగింది. నేనా కొమ్మ పట్టుకుని ఉయ్యాల ఊగుతున్నా - సీమ చింతకాయలు నా పరికిణీలోంచి కిందపడిపోతున్నాయి. 'అమ్మా నా సీమ చింతకాయలు, నేను పడిపోతున్నా, కొమ్మ విరిగింది, నేను పడిపోతున్నా' నా గోలకి అమ్మ పరిగెత్తుకొచ్చింది. వచ్చింది నన్ను దించొచ్చు కదా! ఊహూ, వెళ్ళి మా నాన్నను పిలుచుకొచ్చింది. 'చూడండి మీ ముద్దుల కూతురు ఏంచేసిందో' అంటూ అమ్మ నావైపు చూపిస్తూ, నేనేమో కొమ్మకు వేలాడుతూ, మా నాన్న విరగబడి నవ్వుతూ- ఎంత బాగుంది... కదూ.

నాన్న నన్ను కిందికి దించాడు. అమ్మ మాత్రం ఆపలేదు. 'ఈ పిల్లకు తొందరగా పెళ్ళిచేసి పంపించాలి. ఏ కాలో చెయ్యో విరక్కొట్టుకుంటే ఎవరు చేసుకుంటారు? గుదిబండలా మన మెడకు చుట్టుకువేలాడుతుంది. అసలిది ఆడపిల్లేనా అంట?'

'నేను ఆడపిల్లను కాదమ్మా. ఇదిగో ఈ సీమచింతకాయ చూడు ఎంత తియ్యగా వుందో' అని నోట్లో కుక్కుకుంటూ అమ్మకు ఒకటిచ్చి మళ్ళీ పరుగుతీసేదాన్ని.

నాన్న కూడా పెళ్లి ప్రయత్నాలు మొదలుపెట్టాడు. పూనాలో వుండే పూలే కుటుంబంలో ఒక అబ్బాయితో నా పెళ్ళి నిశ్చయించాడు. 'ఈ సేఠ్‌జీ ఎట్లా ఉంటాడబ్బా అనుకునేదాన్ని!' చింత చెట్లెక్కుతాడా? బావిలో ఈతగొడతాడా? రాత్రిళ్ళు ఆరుబైట పడుకునే చుక్కలు లెక్కబెడతాడా? ఏమో! ఎవరికి తెలుసు? బళ్ళో చదువుకుంటున్నాడని చెప్పారుగా! పుస్తకాలు చదవగలడేమో!

ఆ రోజుల్లో ఆడవాళ్లు గడప దాటకూడదు. ఆడపిల్ల పెరిగిపెద్దయ్యేసరికి- లక్ష్మణుడు గీసిన గీత దాటడం వల్లనే సీతమ్మవారిని రావణాసురుడు యెత్తుకుపోయాడనే కథ ఎన్ని వందలసార్లు విన్నానో ఎవరూ లెక్కబెట్టలేదు. ఆడదంటే వంటింటికీ, వంటింట్లో పొయ్యికీ కట్టుబడి ఉండాలి. పొయ్యిలో కట్టెలు, పొయ్యి ఊదే గొట్టం ఆ పిల్లచేతిలో వుండాల్సిందే. ఆ పిల్ల ఆ గొట్టం గుండా ఊపిరంతా పొయ్యిలోకి ఊదాల్సిందే. భర్తనీ, అత్తమామల్ని సేవించుకోవాలి. అంతే ఇక నీ పని ఇప్పుడు మీ పిల్లలు రెండో తరగతి చదువుతుంటే, మీరు బుజ్జగిస్తుంటారే, ఆ వయసులో మేం అత్తగారింట్లో ఉండేవాళ్ళం.

మా అత్తగారింట్లో నేనెన్నడూ పరాయిదానిలాగా అనుకోలేదు. అదే అసలు నీ ఇల్లనీ ఆడపిల్ల రక్తంలో యింకిపోయేట్లు చెప్తారనుకోండి. కానీ మా మామగారు చాలా మంచిమనిషి. ఇక మా సేఠ్‌జీకి ఎప్పుడూ బడీ, పుస్తకాలు, చదువు. ఇదే ప్రపంచం. ఇంతింత లావు పుస్తకాలు ముందేసుకుని యెప్పుడూ చదువుతూనే ఉండేవాడు. రాస్తూనే ఉండేవాడు. వాళ్ళ పంతులుగారికి ఈయనంటే పరమ ఇష్టమట. ఆ! ఎప్పుడూ పుస్తకాల్లో మునిగి ఉంటే ఎందుకిష్టం ఉండదూ? ఒక్కసారి వచ్చి నాతో ఆడుకోమని అడిగితే యిక చిరునవ్వు చిందిస్తాడు. అన్నీ తనకు తెలుసన్నట్లు బడాయి. నాకు ఆయన్ని సేఠ్‌జీ అని పిలవటమే ఇష్టం.

ఒకరోజు నేను ఇల్లు సర్దుతున్నాను. పుస్తకాల గుట్టమీద వున్న దుమ్ము దులుపుతున్నాను. ఇల్లు శుభ్రంగా ఉండాలి గదా. అదుగో అప్పుడే ఆయనొచ్చాడు. 'నా పుస్తకాలనేం చేస్తున్నావు!' అన్నాడు. 'దుమ్ము దులిపి శుభ్రం చేయొద్దా?' అన్నాను. 'పేజీలు పోగొడతావ్ జాగ్రత్త?' అంటే 'ఎక్కడికిపోవు, అన్నీ ఉంటాయి అన్నాను.

ఇదేంటో మరి?' 'ఏ పేజీ అది' – 'ఏ పేజీనో ఏమిటో నాకేం తెలుస్తుంది? ఏమయిందని మీరిప్పుడీ రగడ చేస్తున్నారు?' అన్నాను. 'అవన్నీ జీవితచరిత్రలు. ఇదిగో చూడు. ఇది శివాజీ గురించి రాసింది, ఆయన ఫోటో ఇది. ఇక్కడ వాషింగ్‌టన్ గురించి రాశారు. ఇది ఆయన ఫోటో'. అని సేఠ్‌జీ అన్నాడు. 'ఎవరూ! శివాజీ నాకూ తెలుసు. మనవాడే కదా! కానీ ఈయనెవరూ ?' పరాయిదేశం మనిషిలాగా వున్నాడు' – 'మన దేశం అయితేనేం కాకపోతేనేం, మనిషి మంచి పనులు చేస్తే మనం అతని జీవితం, వ్యక్తిత్వం, విలువలు అన్నీ తెలుసుకోవాలి.' అన్నాడు. అబ్బో ఈ సంగతులన్నీ మీ బుర్రలో ఉన్నట్టే చెప్తున్నారే' అన్నాను. బుర్రలో ఉంచాలనే ప్రయత్నిస్తున్నా. ఈ పుస్తకం చూడు. ఇది థామస్ పెన్ రాసిన 'మానవునిహక్కులు' అన్న పుస్తకం. మనిషికున్న హక్కులేమిటో బాధ్యతలేమిటో అన్నీ ఈ పుస్తకంలో రాసివున్నాయి.' అని చూపించాడు సేఠ్‌జీ.

ఇలా ప్రతిరోజూ సేఠ్‌జీ నాకు యేదో వొకటి చదివి విన్పించేవాడు. మధ్యలో ప్రపంచం గురించి, మన చుట్టూ ఉండే ప్రపంచం గురించి నాకర్థమయ్యేలా చెప్పటంకోసం ఆపేవాడు. హిందూ ముస్లిం మతాల మధ్య ఉన్న తేడాలేమిటి? క్రైస్తవమతం మనిషి గురించి ఏం చెప్తుంది? మన కులవ్యవస్థ మన సమాజాన్ని యెట్లా నాశనం చేస్తోందో చెప్పేవాడు. వీటన్నిటి గురించీ ఆయన మాట్లాడుతుంటే చెవులు రిక్కించుకుని వినేదాన్ని. సేఠ్‌జీ నిరంతరం చదివేవాడు. కబీర్, తుకారాం, జ్ఞానేశ్వర్ వంటి భక్తుల సాహిత్యం, భక్తిమార్గాన్ని గురించి, బుద్ధుడు బసవేశ్వరుడు, తీర్థంకరుడు మొదలైన మతసంస్కర్తల రచనలన్నీ చదివాడు. చదివాక అవన్నీ నాతో చెప్పేవాడు. స్నేహితులతో చర్చించేవాడు. 'ఇదంతా చదివితే నీకే మొస్తుంది?' ఆపుకోలేక ఒకరోజు అడిగేశాను. ఒకప్పుడు మంచిగా ఉండే మతం మూర్ఖపు ఆచారాలలో సంప్రదాయాలలో చిక్కుకుపోయింది. వీటన్నిటినీ రూపుమాపాలి.' ఈ దరిద్రపు ఆచారాలన్నీ ఎక్కువ తక్కువ కులాలనే విభజన వల్లే వచ్చాయి. మామూలు మనుషులందరికీ చదువు ఎందుకుండకూడదు?' ఆయనలా చెప్పుకుపోతున్నాడు.

పీష్వాలకాలంలో శూద్ర అతిశూద్ర కులాల గొడవలు తారాస్థాయికి చేరడంవల్లనే బ్రిటీష్‌వాళ్లు మన దేశంలో చొచ్చుకురాగలిగారు. ఈ తేడాలు చదువువల్ల మాత్రమేపోతాయి. విద్యే ఈ వివక్షలను పోగొట్ట గలుగుతుంది. అదే – ఆ విద్యే మన ధ్యేయం కావాలి. అణచివేయబడ్డ వర్గాల ప్రజలకు చదువు చెప్పాలి. విద్యావంతుల్ని చెయ్యాలి. 'అయితే నువ్వు చదువు చెబుతుంటే నేను చూస్తూ ఉండాలా? లేకపోతే వంటచేసి పెట్టాలా?' సేఠ్‌జీ తన ఆలోచనల్లో మునిగిపోయాడు. కళ్ళముందున్న భార్య కూడా కనబడటంలేదు. విద్య అనే తపన ఆవహించిన మహావృక్షంలా ఉన్నాడు.

కొన్నిరోజుల తర్వాత సేఠ్‌జీ సాగర్ వెళ్ళాడు. ఆయన బుర్రలో ఒకే ఒక్క విషయం తిరుగుతోంది. చదువు, చదువు, చదువు. సదాశివ గోవింద్ ఆ రోజుల్లో సాగర్‌లో ఉండేవారు. ఆయన సేఠ్‌జీని ఫర్రార్ అనే ఆమె నడిపే బడికి తీసుకెళ్లాడు. ఆమె తెల్లజాతి మనిషి. వీళ్ళిద్దరూ బళ్ళో ఏం నేర్పాలి, ఎట్లా నేర్పాలి అని ఆమె నడగటానికి వెళ్ళారు. ఆమె అందిగదా, "ఇంటికి కేంద్రం ఆడమనిషి. ఆమె చదువుకుంటేనే కుటుంబం బాగుపడుతుంది. లేకపోతే లేదు. మీరు మీ ఆడవాళ్ళకు చదువు చెప్పించకపోవడం అన్యాయం. ఘోరం" అన్నది. అంతే, సేఠ్‌జీ తలలో తొలుస్తున్న పురుగు తన దారి కాస్త మార్చుకుంది. ప్రతి మగవాడూ తన భార్యకు చదువు నేర్పాలి. అక్కడ్నుంచి రావడం రావడమే పలక, బలపం, పుస్తకాలతో వచ్చాడు. నేనప్పుడే రొట్టెలు చేసి పొయ్యి ఆర్పబోతుండగా ఆయన ముఖం వెలిగిపోతూ వుంది. కాళ్ళూ చేతులు కడుక్కుంటూనే నన్ను కేకేశాడు. "అంతా

సిద్ధంగా ఉంది. రొట్టెలు, కూర అన్నీ వున్నాయి. నీదే ఆలస్యం" అని నేను కేకపెట్టాను – "నాకిప్పుడు రొట్టేగిట్టే ఏమీ వొద్దు– నువ్వు ముందిటురా!" అన్నాడు. అబ్బబ్బా ఇవ్వాళ సేఠ్‌జీకేమయింది అనుకుంటూ వచ్చాను. సేఠ్‌జీ చేతిలో పుస్తకాలరాశి.

అప్పట్నుండి నా చదువు మొదలైంది. సేఠ్‌జీ పలకమీద వరసగా అచ్చులు, హల్లులు రాసి దిద్దమన్నాడు. అవే మళ్ళీమళ్ళీ. వేళ్ళు నొప్పెడుతున్నాయి. విసుగుపుట్టేది. సేఠ్‌జీ ప్రతిక్షణం నా చదువుపై శ్రద్ధపెట్టాడు. నాకిప్పుడు చదవడం వచ్చింది. నిన్నమొన్ననేగా సేఠ్‌జీ నాకు అన్నీ చదివి వినిపించేవాడు. ఇప్పుడేమో నేను మాటలు గుర్తుపడుతున్నా. అక్షరాలు, మాటలు, వాక్యాలూ నా ముందు నాట్యంచేస్తున్నాయి. గొబ్బిళ్ళ పాటలన్నీ రాయాలనిపించేది. నా పేరు రాయాలనీ, దాన్ని నా వేళ్ళతో తాకి చూసుకోవాలని అనిపించేది. నెమ్మదిగా నాకు చదవటమంటే చాలా ఇష్టం కలిగింది.

ఒకరోజు మామగారు అడగనే అడిగారు. "జ్యోతి– సావిత్రికెందుకు చదువు నేర్పుతున్నావు?" అని. "ఎందుకు నేర్పకూడదు?" అని సేఠ్‌జీ అన్నాడు. అసలు మన కులంవాళ్ళమే చదువుకోకూడదు. అయినా నిన్ను చదివించాను. ఇప్పుడు నువ్వు నీ భార్యకు చదువు చెబుతున్నావు" అని మామగారు అన్నారు. "ఆమె కూడా మనిషేగా? కాదంటే చెప్పు" అని సేఠ్‌జీ అన్నాడు. "నిజమే కావచ్చు కానీ ఆడదానికి చదువు పనికిరాదు. చదువుకున్న ఆడది చెడిపోతుంది. బుద్ధి లేనిదవుతుంది" అని మామగారు అన్నారు. "నాన్నా! సావిత్రి చదువుకుని ఆ మాటలన్నీ అబద్ధాలని నిరూపిస్తుంది" అని అన్నారు సేఠ్‌జీ. మామగారు యింకేమీ చెప్పలేక అక్కడినుంచి వెళ్ళిపోయారు.

ఇదంతా ఒకవైపు జరుగుతుండగానే సేఠ్‌జీ తక్కువ కులాల ఆడపిల్లల కోసం ఒక బడిపెట్టాడు. ఇక దాంతో ప్రళయం ముంచుకొచ్చింది. ఎవరేమనుకున్నా సేఠ్‌జీ ఖాతరు చెయ్యలేదు. బడి బ్రహ్మాండంగా ఉంది. అన్నాసాహెబ్ చిప్‌లూంకర్ భవనంలో ఆడపిల్లలకోసం రెండో బడి కూడా మొదలైంది. కేశవరావ్ భవాల్కర్, జగన్నాథ్ సదాశివ్, అన్నాశాస్త్రి బుద్ధే, బాపూరావ్‌జీ మందే, విష్ణుమొరేశ్వర్, భిడే కృష్ణశాస్త్రి, చిప్‌లూంకర్– వీళ్ళందరూ కార్యనిర్వాహకులుగా ఉన్నారు. ఆ బడికూడా చక్కగా నడుస్తోంది. ఒకరోజు సాయంత్రం సేఠ్‌జీ ముఖం వేలాడేసుకుని వచ్చాడు. ఏం జరిగిందని అడిగాను. ఆయన మాట్లాడకుండా అటూ యిటూ అశాంతిగా తిరుగుతున్నాడు. మళ్లీ అడిగాను. 'ఏమైంది? జరగరానిది జరిగిందా?' – "స్కూలు నడిపే పంతులుగారు బడిమానివేశారు. ఇప్పుడేం చెయ్యాలి?" అన్నారు. "మనమేం చెయ్యగలం?" అన్నాను. నాకు తెలియటంలా. కానీ తక్కువ కులాలవాళ్ళు కూడా చదువుకుని టీచర్లు కావాలి. కానీ అంతవరకూ యేంచెయ్యాలి?" చివరకు కొత్తపంతులుగారు దొరికేవరకు నన్ను బడికి రమ్మన్నాడు. "ఆ పిల్లకు పుస్తకాలు చదివి వినిపించుదువుగాని" అన్నాడు. "నేనా చదువు చెప్పటమా? నా వల్లగాదు" నేను చెప్పేది వినిపించుకోకుండానే సేఠ్‌జీ భావాల్కర్‌తో మాట్లాడడానికి వెళ్ళిపోయాడు. వాళ్ళేం మాట్లాడుకున్నారో దేవుడికి తెలియాలి. భవాల్కర్‌గారు వెంటనే మా యింటికొచ్చారు. "అంతా నిర్ణయమైపోయింది. రేపట్నుంచి నువ్వు బడికొచ్చి పిల్లలకు చదువు చెప్పాలి?" అని అన్నారు. "నేనెట్టా చెప్తాను? ఏం చెప్తాను"– అని అన్నాను. "నువ్వు చెప్తావు అంతే, ఎట్లా చెప్పాలో నేను నేర్పిస్తా" వాళ్ళిద్దరూ కూడా నేను చెప్పేది వినిపించుకునే స్థితిలో లేరు. బడిలో పాఠాలు చెప్పడానికి ఒప్పుకోక తప్పలేదు.

నేను బడికిపోతుంటే జనం కిటికీల వెనక నిలబడి తిట్టేవారు. శాపనార్థాలు పెట్టేవారు. నీచమైన మాటలన్నీ అనేవారు. బడికి వెళ్ళగానే అక్కడ తలుపులు కిటికీలు మూసే లోపల పిల్లలకు సుమతిశతకం, కూడికలు, తీసివేతలూ, భూగోళశాస్త్రం, మరాఠా చరిత్ర ఇవన్నీ చెప్పేదాన్ని. సేఠ్‌జీ మాల మాదిగల పేటలకు వెళ్ళి చదువు ఎంత అవసరమో ప్రచారం చేస్తుండేవాడు.

ఆ రోజుల్లో సేఠ్‌జీ, జస్టిస్ రనడే ఇలా అనేవారు : "మానవులందరూ పుట్టుకతో సమానులు. వాళ్ళు ఒకరికొకరు సమానులుగా చూసుకోవాలి. ఏ ఒక్కరి ప్రయోజనమూ మిగిలినవారందరికీ హానిచేసేదిగా ఉండకూడదు." కానీ ఇట్లా ఆలోచించే శక్తి కూడా నశించిపోతుంది. ఇప్పటికే నశించిపోయినదాన్ని పునరుద్ధరించటానికి ఒక తరం మొత్తం పనిచేసినా చాలదు. కానీ ఒకవైపు నాశనం యింకా జరుగుతూనే వుంది. చివరకు మన చేతుల్లో ఏదీ మిగలదా అనిపించే విధంగా నడుస్తోంది చరిత్ర.

కాని ఆ రోజుల్లో యిట్లా లేదు. ఆలోచనాశక్తి నాశనంకాలేదు, మీకు చెప్తాను వినండి. ఒకరోజు రాత్రి అందరం అన్నాలు తిన్నాం. అందరూ ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు. సేఠ్‌జీ లెక్కలు చూసుకుని నిద్రపోవడానికి సిద్ధమయ్యాడు. దుప్పట్లు కప్పుకున్నాం. అంతలో పెరటిగుమ్మం తలుపు కిర్రుమన్న చప్పుడు. ఇద్దరు మనుషులు గొడ్డళ్ళతో ఆ తలుపుగుండా చప్పుడు చేయకుండా వస్తున్నారు. ఆ మసక వెల్తురులో కూడా వాళ్ళ ముఖాలలో భీకరత్వం కనబడుతోంది. నేను పెద్దగా అరిచాను. సేఠ్‌జీ కూడా ఎవరు వాళ్ళు అని అడుగుతున్నంతలో వాళ్ళొచ్చి మా ముందు నిలబడ్డారు. గొడ్డళ్ళు పైకెత్తారు. నేను పరిగెత్తుకెళ్ళి వాళ్ళకూ సేఠ్‌జీకి మధ్యలో నిలబడ్డాను. "అన్నలారా– ఆపండి, దయచేసి వెళ్ళిపొండి" భయంతో ప్రార్థించాను. వాళ్ళలో ఒకడు గర్జించాడు. "నువ్వవతలకు పో, మేం ఆగటానికి యిక్కడకు రాలేదు"– అయితే మీరిక్కడికి యెందుకొచ్చారు" అని అడిగాడు సేఠ్‌జీ నెమ్మదిగా. "కొందరు పెద్దలు నిన్ను చంపే కాంట్రాక్టు మాకిచ్చారు. నువ్వు ఈ బడులు నడపటం, ఈ యవ్వారమంతా మానేస్తేగాని సంఘం బాగుపడదని వాళ్ళు చెప్పారు"– అంటే నా చావు మీకు లాభం అన్నమాట. చంపండి మరి. బీదవాళ్ళకు సహాయం చెయ్యడమే నా జీవితాశయం. వాళ్ళ చేతుల్లో చావటంలో తప్పేముంది? చంపండి. రండి, చంపండి" సేఠ్‌జీ మెడవంచి సిద్ధమయ్యాడు. శాంతంగా చావుకు సిద్ధమయ్యాడు. అంతా నిశ్శబ్దంగా వుంది. నేను ఊపిరితీసే చప్పుడొక్కటే వినిపిస్తోంది.

ఆ ఇద్దరు మనుషులు గొడ్డళ్ళు కిందపారేశారు. సేఠ్‌జీ కాళ్ళమీద పడ్డారు. "మేం మిమ్మల్ని చంపం. మీరు మాకు తండ్రిలాంటివారు. ఇప్పుడే వెళ్ళి మమ్మల్ని పంపినవాళ్ళని చంపివస్తాం" వాళ్ల కళ్ళు ఎర్రగా వున్నాయి. కోపమూ బాధా రెండూ ఆ కళ్ళలో కనపడుతున్నాయి. సేఠ్‌జీ వాళ్ళను ఆపాడు. వాళ్ళ ఆలోచన మారేదాకా వాళ్ళతో మాట్లాడాడు. ఆ ఇద్దరు హంతకుల పేర్లు దోండిరామ్, నామ్‌దేవ్ కుంబార్‌రోడే. వాళ్ళిద్దరూ రాత్రి బడిలో చేరారు. తర్వాత రోడే సేఠ్‌జీ బాడీగార్డుగా తయారయ్యాడు. కుంబార్ 'వేదాచార్' అనే పుస్తకం రాసి మా పనికెంతో సహకరించాడు. చంపటానికి వచ్చినవాళ్ళ హృదయం మారిందంటే ఆ రోజుల్లో మనుషులు ఆలోచించేవాళ్ళు. నాకట్లాగే అనిపిస్తోంది.

మేము ఒక బిడ్డను దత్తత చేసుకున్నాం. మా స్వంత కొడుకులాగానే అతన్ని పెంచాం. మనిషినీ మనిషినీ కట్టివేసేది రక్తసంబంధం మాత్రమే కాదు. మానవత్వం మరింత బలమైన బంధం. కానీ ఇవాళ కులం పెద్ద సమస్యగా మారింది. ఎందుకంత పెద్ద సమస్య అయింది? మీరు ఆలోచించండి. మా ఆలోచనలూ మా ఆదర్శాలూ

వాటికి కాలం చెల్లిపోయిందా? ఇవాళ, రేపు ఎవరైనా దత్తత తీసుకోవాలంటే కులం, రంగు, జాతి అన్నీ చూస్తున్నారు. అసలు దత్తత తీసుకోవాలనే అనుకోరు. కానీ కొత్తగా ఈ లోకంలోకి వచ్చిన ప్రాణికి కులం ముద్రవేయటం దేనికి?

జ్యోతిరావ్ పూలే మొదటి బాలికల పాఠశాల ప్రారంభించాడంటారు. శిశుహత్యలకు వ్యతిరేకంగా మొదటి ఆశ్రమం స్థాపించాడంటారు. సావిత్రిబాయి మొదటి పంతులమ్మ అని కూడా అంటారు. ఇదంతా నిజమే కావచ్చు. కాని ఆ పని అక్కడితో ముగిసిపోకూడదు. ఆశ్రమాన్ని మా స్వంత డబ్బుతో ప్రారంభించాం. తర్వాత పండరిపురంలో అలాంటి ఆశ్రమాన్నే యేర్పరచినపుడు సేఠ్‌జీ మా ఆశ్రమాన్ని యిక పెంచలేదు. ఆయన అనేవాడు, “నిజమే, ఈ పని నేను మొదలుపెట్టాను. కానీ మనం మాత్రమే ఈ పని చెయ్యాలి అని అనుకోకూడదు. యింకొకళ్ళు ఇలాంటి పనే చేస్తుంటే మనం ఇంకో కొత్త పని ప్రారంభించడాకి సంకోచించకూడదు.”

మా మనసుల్లో ఒకసారి ఆ ఆలోచనకు బీజం పడిందంటే ఇక అది కార్యరూపం దాల్చాల్సిందే. ఆలోచన ఆచరణగా వెంటనే మారాల్సిందే. మా ఆలోచనలు అన్నిచోట్లా విస్తరించేందుకు సంఘం పెట్టాలని అనుకున్నాం. 1873 సెప్టెంబరు 23న తారీకున సత్యశోధక సమాజాన్ని ఆవిష్కరించుకున్నాం. ఆ సమాజం ఒక మౌలిక సూత్రం మీద ఆధారపడింది. దేవుడు ఒక్కడే. మనందరం ఆయన పిల్లలం. ఆయనను ప్రార్థించటానికి ఈ మధ్య దళారీలు యెందుకు? ఒక మనిషి మంచివాడుగా, గొప్పవాడిగా చేసేది గుణమేగాని కులం కాదు. మనం సత్యంకోసం అన్వేషిస్తున్నాం. భగవంతుడు అన్నిటినీ సృష్టించాడు. అందువల్ల సేఠ్‌జీ ఆయనను సృష్టికర్త అనేవాడు. ఆయన మన తండ్రి; మనం ఆయన పిల్లలం. ఈ సత్యాన్ని అంగీకరించిన వారెవరైనా సత్యశోధక సమాజంలో సభ్యుడు కావొచ్చు. కులం ఏదనే ప్రసక్తి లేదు. సత్యశోధక సమాజం ఆధ్వర్యంలో మొదటి వివాహాన్ని 25.12.1873లో సమాజం పద్ధతిలో జరిపించాం. మేం గెలిచాం. ఇప్పుడు నాలో నేను అనుకుంటాను. “మా తర్వాత వచ్చిన ఈ ప్రజలు మా విజయాలను ముందుకు తీసుకెళ్తున్నారా లేక వాటిని అక్కడే భూస్థాపితం చేసి జీవం లేకుండా చేస్తున్నారా?” అని.

సేఠ్‌జీకి పక్షవాతం వచ్చి కోలుకున్నారు కాని ఎప్పుడూ ఇతరమైన జబ్బులేవో చేస్తూనే ఉన్నాయి. ‘మరీ అలసిపోవద్దు’ అని నేనంటే “సావిత్రీ చేయాల్సిదెంతో వుంది. ఒక జీవితకాలం సరిపోదు. నేను వూరికే యెట్లా కూర్చోను? నావల్లకాదు’ అని సమాధానం వచ్చేది. చివరికి ఆయన మంచం దిగే స్థితి కూడా పోయింది. బలహీనమైపోయాడు. ఎప్పుడూ మంచంమీదే పడుకుని ఉండటం భరించలేకపోయేవాడు. ఆయన్ని చూడటానికి జనప్రవాహం ఎడతెగకుండా వచ్చేది. ఒక రోజు పండిత రమాబాయి వచ్చింది. “ఇంకో జ్యోతిబా, యింకో సావిత్రి మళ్ళీ పుట్టొచ్చునేమో కాని వీళ్ళిద్దరూ కలిసి ఒకటిగా పనిచేసిన విధం అన్ని కాలాలకూ ఆదర్శంగా నిలుస్తుంది” అన్నదామె. సేఠ్‌జీ తన చుట్టూ జనాన్ని ఏడవొద్దని సైగచేసి మమ్మల్ని అఖండ్ పాడమని సైగ చేశాడు. అఖండ్ పాటను వింటూనే సేఠ్‌జీ యాత్ర ముగిసింది. హృదయ విదారక రోదనలు మిన్నుముట్టాయి. నిప్పులకుండను పట్టుకుని “సత్యమేవ జయతే – అఖండ సత్యం– సత్యమేవ జయతే– అఖండ సత్యం” అనుకుంటూ ఆయన అంతిమయాత్రను నేనే నడిపించాను.

1897 పూనాలో ప్లేగువ్యాధి ప్రబలింది. పట్టణం ఎడారి అయిపోయింది. జనమంతా దగ్గర్లో ఉన్న అడవుల్లోకి పారిపోయారు. ఇట్లాంటి సమయాల్లో తక్కువ కులాలవాళ్లకు సహాయపడాలని ఎవరనుకుంటారు? నేను నా కొడుకు యశ్వంత్, సమాజం సభ్యులు వ్యాధిగ్రస్తులకు సాయంగా వెళ్ళాం. ఒక గుడిసెలో రెండేళ్ళ పసివాడు బాధతో ఉంగలు చుట్టుకుపోతూ కనిపించాడు. ఆ పిల్లవాడిని యెత్తుకుని డాక్టర్ దగ్గరకు పరుగెత్తాను. ప్లేగు అంటువ్యాధైనా ప్రాణంకోసం పెనుగులాడుతున్న ఆ పసిగుడ్డును ఎత్తుకోకుండా ఎలా ఉండగలను? నా గుండెలకు అదుముకున్నాను. ఆ పసిబిడ్డ చావాల్సిఉంటే మరొక మనిషి ప్రేమ ఇచ్చే వెచ్చదనంలో చనిపోనివ్వు. ఆ బిడ్డ చనిపోయాడు. నాకు కూడా ప్లేగువ్యాధి సోకింది. నా ప్రయాణం పరిసమాప్తమయింది.

నేను పనిలో వుండగా మృత్యువు నన్ను వరించటం నా అదృష్టం.

***

ఎందుకు నేను మీకీ సంగతులన్నీ చెబుతున్నాను? ఆమె గొంతుతో ఎందుకు మాట్లాడుతున్నాను?

చనిపోయిన మనుషుల గతం చరిత్రకు చెందుతుంది. కాని వాళ్ళు చేసిన పని మనుషులకు విశ్వాసాన్నివ్వాలి. ఆలోచనే మానవులను జీవింపజేస్తుంది. మళ్ళీ మళ్ళీ నేను నొక్కి చెప్పదల్చుకున్నదదే. కాని మళ్ళీ నేను ఇదంతా తిరిగి చెప్పాల్సిందేనా?

©SCERT not to be republished

## ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు పది వాక్యాలకు మించని సమాధానాలు రాయండి.**

1. సావిత్రీబాయి కాలంలో స్త్రీల పరిస్థితులు ఎలా ఉండేవి?
2. సేఠ్‌జీ అంటే ఎవరు? ఆయన వ్యక్తిత్వాన్ని గురించి వివరించండి.
3. జ్యోతీరావ్ పూలేని చంపడానికి వచ్చిన వాళ్ళు పరివర్తన చెందిన సంఘటనను తెలపండి.
4. సావిత్రి బాయిపూలే పాత్రను ఏకపాత్రాభినయనం చేయండి.